RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 16 సంచిక : 2 అక్టోబర్ 18 ఆదివారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం... చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ

- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్

మంగళగిరి, అక్టోబర్ 17 : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (NSTR) పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను NSTRకు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు. సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

ఒంగోలు మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీశిల్ప

- టీడీపీ మూడో జాబితాలో చోటు.. సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం

ఒంగోలు, అక్షర ప్రకాశం : ఒంగోలు నగర మేయర్ అభ్యర్థిగా నల్లమల్లి శ్రీశిల్ప పేరును తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. శనివారం రాత్రి విడుదల చేసిన పార్టీ మూడో జాబితాలో ఆమెకు స్థానం కల్పించింది. మేయర్ పదవిని ఆశించిన పలువురు నేతలను పక్కనపెట్టి అధిష్ఠానం అనూహ్యంగా శ్రీశిల్పకు అవకాశం కల్పించడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నల్లమల్లి శ్రీశిల్ప కాపు సామాజికవర్గానికి చెందినవారు. ఆమె ప్రముఖ బంగారు నగల వ్యాపారి నల్లమల్లి బాలును వివాహం చేసుకున్నారు. నల్లమల్లి బాలు ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందినవారు. ఈ నేపథ్యంలో రెండు సామాజికవర్గాలకూ ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒంగోలు మేయర్ పదవిని ఆశిస్తూ పార్టీలోని పలువురు నాయకులు తమ ప్రయత్నాలు కొనసాగించారు. అయితే చివరకు వారి ఆశలను పక్కనపెట్టి శ్రీశిల్ప పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. నల్లమల్లి బాలు అభ్యర్థిత్వంపై కూడా చర్చ జరిగిన నేపథ్యంలో, ఆయన సతీమణి శ్రీశిల్పకు అవకాశం కల్పించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ సామాజిక, రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక చేసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఒంగోలు నగర రాజకీయాల్లో మేయర్ పదవికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో అభ్యర్థి ఎంపికపై కొంతకాలంగా ఉత్కంఠ నెలకొంది. తాజాగా మూడో జాబితాలో శ్రీశిల్ప పేరు ప్రకటించడంతో అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చింది. అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయం నేపథ్యంలో నగర రాజకీయాల్లో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామిని దర్శించుకున్న భక్తులు

రాచర్ల, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా రాచర్ల మండలంలోని జేపుల్లలచెరువు గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో కొలువై ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో నాగయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం గిద్దలూరు డిపో నుండి రాచర్ల, అన్నంపల్లె మీదుగా బస్సు సౌకర్యం కల్పించారు. అలాగే వచ్చిన భక్తులందరికీ వివిధ అన్నసత్రాలలో అన్నదాన సౌకర్యం కల్పించారు.

శ్రీ వల్లభ నారాయణస్వామి ఆలయంలో భవానిల ప్రత్యేక పూజలు

రంగంపేట, అక్షర ప్రకాశం : దిమిలి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వల్లభ నారాయణస్వామి ఆలయంలో శ్రీ గాయత్రి భవాని దీక్షాపరులు ఏడవ రోజు అయిన శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారికి ఆలయ అర్చకులు నేతేటి గోపాలకృష్ణమాచార్యులు (బుజ్జి) పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మర్రిపాలెం, చిన్న పాలెం, మురకాడ, పట్టిపోలు, దిమిలి, తిరువపల్లి 8 గ్రామాల నుండి భవాని దీక్షాపరులు విచ్చేయగా వారికి మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తదనంతరం గ్రామంలో అమ్మవారి ఊరేగింపుకి సన్నాహాలు ప్రారంభించగా అకాల వర్షం కారణంగా ఊరేగింపును భవాని మాలదారులు నిలిపివేయడంతో గ్రామస్తులు నిరుత్సాహపడ్డారు.

జాన్ డేవిడ్ సేవామార్గం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం : ప్రత్తిపాటి

- వారి సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం సేవాతీర్థ్ పేరిట పోస్టల్ కవర్ విడుదల చేయడం అభినందనీయం - జాన్ డేవిడ్ శతజయంతి కార్యక్రమంలో ప్రత్తిపాటి

అక్షర ప్రకాశం : ఏ.ఎమ్.జీ వ్యవస్థాపకులు, మానవతావాది, సేవాతత్పరుడు అయిన జాన్ డేవిడ్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన సేవామార్గంలో నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శనివారం ఏ.ఎం.జీ ఇండియా, ఇంటర్నేషనల్ సంస్థ ప్రాంగణంలో జరిగిన జాన్ డేవిడ్ శతజయంతి కార్యక్రమానికి ప్రత్తిపాటి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్ డేవిడ్ సేవలకు గుర్తింపుగా తపాలాశాఖ విడుదల చేసిన ప్రత్యేక పోస్టల్ కవర్ ను ప్రత్తిపాటి ఆవిష్కరించారు. అనంతరం ఆయన కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో జాన్ డేవిడ్ కు ప్రత్యేక అనుబంధం.

విద్య, వైద్య, సేవా విభాగాల్లో జాన్ డేవిడ్ ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివని, ఆయన పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా ప్రత్యేకమైన అభిమానం ఉండేదని, వారిద్దరిది మధ్య మంచి అనుబంధం ఉందని ప్రత్తిపాటి తెలిపారు. జాన్ డేవిడ్ సేవల్ని గుర్తిస్తూ భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తపాలాశాఖ సేవా తీర్థ్ పురస్కారాన్ని ప్రకటించడం నిజంగా సంతోషించాల్సిన అంశమని ప్రత్తిపాటి చెప్పారు. మానవతామూర్తి మదర్ థెరిస్సాను ఎలాగైతే ఆదర్శంగా తీసుకుంటామో, అదే విధంగా సేవాభావం కలిగిన వారు జాన్ డేవిడ్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాన్ డేవిడ్ ఆశయాల సాధన కోసం వారి కుటుంబసభ్యులు మహంతి, జెస్సీ బాబులు తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. పేదలకు అన్నివిధాలా అండగా నిలుస్తూ, చిలకలూరిపేట అభివృద్ధికి ఏ.ఎం.జీ సంస్థ విశేషంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజరమేష్, నియోజకవర్గ అబ్జార్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గట్టినేని సాయి, ఏ.యం.జీ సభ్యులు, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

రంగంపేట, అక్షర ప్రకాశం : రంగంపేట మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన గంగాధర్ అనే విద్యార్థి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. వారి తండ్రి అప్పారావు ఓ సాధారణ సన్న కారు రైతు తన కుమారుని ఉన్నత స్థానంలో చూడాలనే అతని ఆశయాన్ని గంగాధర్ పట్టుదలతో నెరవేర్చాడు. గంగాధర్ మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివాడు చదువుకు పేదరికం అడ్డు రాదని నిరూపించిన గంగాధర్ను కాపు సామాజిక వర్గ పెద్దలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అభినందించారు.

అక్షర ప్రకాశం

ఆదివారం 18 - 10 - 2026

పావులూరి సుబ్బాయమ్మ మృతికి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సంతాపం

- తిమ్మాపురంలో సంఘం డైరీ డైరెక్టర్ శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

యడ్లపాడు, అక్షర ప్రకాశం : యడ్లపాడు మండ లం తిమ్మాపురం గ్రామ వాస్తవ్యులు, సంఘం డైరీ డైరెక్టర్ పావులూరి శ్రీనివాసరావు తల్లి పావులూరి సుబ్బాయమ్మ మృతి చెందడంతో గ్రామస్థులు, నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) మర్రి రాజశేఖర్ తిమ్మాపురం లోని వారి స్వగృహానికి వెళ్లి, సుబ్బాయమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో పాటు అలవాల వీరారెడ్డి, పావులూరి వీరయ్య, తల్లపనేని రామారావు, పావులూరి కోటయ్య, పావులూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ వైకాపా అభ్యర్థిగా షేక్ కరీమూన్ నామినేషన్

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ కరీమూన్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె తన నామినేషన్ పత్రాలను సంబంధిత ఎన్నికల అధికారులకు అధికారికంగా సమర్పించారు. ఈ సందర్భంగా షేక్ కరీమూన్ మాట్లాడుతూ.. ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన తనపై నమ్మకంతో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన మాజీ మంత్రి విడదల రజినికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, చిలకలూరిపేట పట్టణ సమగ్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా విజయమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సమష్టిగా శ్రమిస్తామని తెలిపారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు షేక్ కరీమూన్‌ను అభినందించి తమ మద్దతు తెలియజేశారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం సైనికులా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నూతన కరెన్సీతో అమ్మవారి దర్శనం

రంగంపేట, అక్షర ప్రకాశం : రంగంపేట శివాలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శనివారం శ్రీ ఉమాదేవి అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా మూడు లక్షల రూపాయల నూతన కరెన్సీ నోట్లతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా, నయనానందకరంగా అలంకరించారు.

ధనధాన్యాలు, సకల ఐశ్వర్యాలు ప్రసాదించే శ్రీ మహాలక్ష్మీ దేవి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించినట్లుగా ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్ర కుమార్ తెలిపారు. అదేవిధంగా రాజమహేంద్రవరం నల్లమందు సందులో వేంచేసి యున్నటువంటి శ్రీ ఐశ్వర్య లక్ష్మి పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ ఐశ్వర్య లక్ష్మీ పద్మావతి అమ్మవార్లకు శరన్నవరాత్రి పురస్కరించుకుని మహిళ మూర్తులచే సామూహికంగా కుంకుమార్చనలు ఆలయ అర్చకులు శ్రీమాన్ పంచాంగం వెంకట రంగాచార్య స్వామి వారి పర్యవేక్షణలో నిర్వహించారు.

గురజాలలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విజిలెన్స్ కొరడా

గురజాల, అక్షర ప్రకాశం : మండలంలోని దైదలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై వేగవంతమైన విజిలెన్స్ విచారణ. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్. రెవెన్యూ అధికారులతో కలిసి భూ రికార్డులపై లోతైన పరిశీలన. గత వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు. భూ రికార్డులను తారుమారు చేసి, ప్రభుత్వ భూములను వ్యక్తిగత పేర్లపైకి మార్చిన వ్యవహారాలపై ఆరా. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకునే అవకాశం.

డాక్టర్ జాన్ డేవిడ్ ఆశయాలే మనకు శ్రీరామరక్ష

- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

- చిలకలూరిపేట AMG ఇంటర్నేషనల్ వేదికగా ఘనంగా డాక్టర్ జాన్ డేవిడ్ 100వ జయంతి వేడుకలు.. పూర్వ విద్యార్థులు, ప్రముఖుల ఘన నివాళి

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : చిలకలూరిపేట పట్టణంలోని AMG ఇంటర్నేషనల్ వేదికగా AMG సంస్థ స్థాపకులు, ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జాన్ డేవిడ్ 100వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరుకాగా, శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ జాన్ డేవిడ్ సేవలను, సమాజంపై ఆయన చూపిన ప్రభావాన్ని స్మరించుకుంటూ ప్రసంగించారు.

కృతజ్ఞతంటే ఇదే:

డాక్టర్ జాన్ డేవిడ్ 100వ జయంతిని ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి నిర్వహించడం ఎంతో అభినందనీయమని మర్రి రాజశేఖర్ అన్నారు. జాన్ డేవిడ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు, జ్ఞాపకాలు అందరి హృదయాల్లో నిలిచి ఉన్నాయన్నారు. ఈ సంస్థ ద్వారా చదువుకుని దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు, స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ మూలాలు మర్చిపోకుండా ఈ వేడుకలు నిర్వహించడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నారని కొనియాడారు. సమాజంలో ఒక పౌరుడిగా, ఉన్నత అధికారిగా, వ్యాపారిగా, కళాకారుడిగా తాము ఈరోజు ఈ స్థితిలో ఉండటానికి కారణమైన ఆ మహనేతకు హ్యాట్సాఫ్ చెబుతున్నామని అన్నారు.

చిలకలూరిపేటకు రెండో మంచినీటి చెరువు ఏర్పాటులో కీలక పాత్ర:

చిలకలూరిపేట ప్రజలతో డాక్టర్ డేవిడ్ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్న రాజశేఖర్, పట్టణ తాగునీటి అవసరాల కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు.

పూర్వం పట్టణంలో ఒకటే మంచినీటి చెరువు ఉండేదని, జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నాటి శాసనసభ్యులు సోమేపల్లి సాంబయ్య కోరిక మేరకు జాన్ డేవిడ్ చొరవ తీసుకున్నారని తెలిపారు. దాతలను ఒప్పించి సుమారు 200 ఎకరాల మంచినీటి చెరువు తవ్వడానికి మూలకారకులుగా నిలిచి, రాబోయే 50 ఏళ్ల పాటు పట్టణ ప్రజల తాగునీటి ఇబ్బందిని తీర్చిన మహానుభావుడని ప్రశంసించారు.

సేవకే అంకితమైన కుటుంబం:

సమాజం వెలివేసిన కుష్ఠు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని అండగా నిలిచిన ఘనత AMG సంస్థకే దక్కుతుందన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎక్కడ ఏ కష్టం వచ్చినా, వరదలు సంభవించినా ప్రజలకు ముందుగా గుర్తుకువచ్చేది AMG సంస్థే అని తెలిపారు.

అరుణ్ కుమార్ మహంతి, డాలీపాప వంటి వారు కాలనీల నిర్మాణంలో, పేద ఇళ్ల నిర్మాణంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. జాన్ డేవిడ్ రక్తంలోనే సేవా భావం ఉందని, ఆ కుటుంబం ఎప్పుడూ ప్రజా సంక్షేమం గురించే ఆలోచిస్తుందని అన్నారు.

కరదీపిక ఆవిష్కరణ:

ఈ వేడుకల సందర్భంగా డాక్టర్ జాన్ డేవిడ్ జీవిత విశేషాలు, సేవలు మరియు ఆయన ప్రస్థానాన్ని సమగ్రంగా వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక జీవిత చరిత్ర కరదీపికను శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం వేదికపై ఉన్న ప్రముఖ అతిథులందరికీ ఆ కరదీపికలను స్వయంగా అందజేశారు.

పిఠాపురంలో హోరా హోరీగా నామినేషన్ల జోరు

పిఠాపురం, అక్షర ప్రకాశం : పిఠాపురం మున్సిపాలిటీలో రెండో రోజు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. చైర్పర్సన్ అభ్యర్థులుగా ఇద్దరు నామినేషన్ దాఖలు చేయగా వారిలో పిఠాపురం మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బహుజన సమాజ్ పార్టీ నుండి కందవల్లి లోవరాజు, తెలుగు జనతా పార్టీ నుండి చైర్పర్సన్ అభ్యర్థిగా సాంబత్తుల చిన్నబాబు నామినేషన్ దాఖలు చేయగా, రెండవ రోజు అత్యధికంగా కౌన్సిలర్ అభ్యర్థులకు 77 నామినేషన్లు వచ్చాయి. కౌన్సిలర్ అభ్యర్థులుగా వైసిపి పార్టీ నుండి 27, తెలుగుదేశం పార్టీ నుండి 21 జనసేన పార్టీ నుండి 22, భారతీయ జనతా పార్టీ నుండి 3 స్వతంత్ర అభ్యర్థులుగా 4 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్‌కు మద్దతు కోరిన నేతలు

తిరుపతి, అక్షర ప్రకాశం : పులిమామిడి యాదగిరి, తాంజావూరు మునేంద్రను కలిసిన నీరుగట్టు నగేష్. ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్ ఎన్నికల నేపథ్యంలో మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, ప్రజా ఉద్యమ కారుడు, జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పులిమామిడి యాదగిరిని, సంఘం కార్యదర్శి తాంజావూరు మునేంద్రను ఆయన కలిసి మద్దతు కోరారు. ప్రజా ఉద్యమాల్లో అనుభవం కలిగిన నాయకులను కలిసి తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని నీరుగట్టు నగేష్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై వివిధ ప్రజాసంఘాలు, ఉద్యమకారుల మద్దతు కూడగట్టే దిశగా ఆయన ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ భేటీతో తిరుపతి నగర రాజకీయాల్లో ఎన్నికల మద్దతు సమీకరణాలపై ఆసక్తి నెలకొంది. అయితే నీరుగట్టు నగేష్‌కు మద్దతుపై పులిమామిడి యాదగిరి, తాంజావూరు మునేంద్ర స్పందిస్తూ నిరంతరం విద్యార్థి యువజనల ప్రజా సమస్యలపై గళం ఎత్తి పోరాడుతున్న యువ నాయకుడు నీరుగట్టు నగేష్ తిరుపతి మేయర్ ప్రజలకు మంచి

రోజులు వస్తాయని ఆశవాహం వ్యక్తం చేశారు. ప్రజలందరూ కూడా మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,